రూ.లక్షల ప్రజాధనం వృథా



పూర్తిగా తుప్పు పట్టిన మదనాపురం పల్లెప్రకృతివనం బోర్డు



పర్యవేక్షణ లేక పాడైన క్రీడా వస్తువులు, పేరుకుపోయిన చెత్త

- అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా పల్లె ప్రకృతి వనాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మదనాపురం: గ్రామాలను పచ్చని తోరణాలుగా మార్చాలన్న ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె పకృతి వనాలు గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. వనాలు ఆయా గ్రామాల్లో నిరుపయోగంగా కన్పిస్తున్నాయి. మదనాపురం, అజ్జకొల్లు, కొత్తపల్లి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఆదరణకు నోచుకోకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం ప్రియులు అక్కడే మద్యం సేవిస్తున్నారు. పగటి వేళల్లో సైతం మద్యం తాగిన ప్రకృతి వనాల్లో ఉంటుండడంతో ప్రజలకు అక్కడకు వెళ్లడానికి ఆసక్తి చూపట్లేదు. మండల కేంద్రంలోని పకృతి వనం మరీ అధ్వానంగా తయారైంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాటికి కనీసం నీటిని కూడా అందించకపోవడంతో చెట్లు ఎండిపోయాయి. పిల్లల ఆటల వస్తువులు, కంపౌండ్ పూర్తిగా దెబ్బ తినడంతో పందులు సంచరిస్తున్నాయి. పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోయి విషసర్పాలకు ఆవాసంగా మారాయి.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

రూ.లక్షలు వెచ్చించి అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల పూర్తిగా మరుగున పడుతున్నాయి. ప్రతి గ్రామంలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వనాల వైపు కన్నెత్తి చూసే వారే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజాధనం వృథాడా పల్లె ప్రకృతి వనాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎస్ఐకి సన్మానం




మదనాపురం: మండల నూతన ఎస్ఐగా శేఖర్ రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బహుజన సమాజ్ పార్టీ దేవరకద్ర సెక్రెటరీ చిన్న కురుమన్న, మదనాపురం మండల అధ్యక్షుడు బురాన్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి బాలయ్య, ప్రధాన కార్యదర్శి చింతకాయల రాములు ఉన్నారు.

దాతకు..



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని సాయిబాబ ఆలయ నిర్మాణ పనులకు గతంలో చేపల వ్యాపారి ప్రకాష్ రూ.50 వేలు సాయిసేవాసమితి సభ్యులకు విరాళంగా అందించారు. శుక్రవారం సాయిబాబ ఆలయాన్ని ఆయన దర్శించుకున్న సందర్భంగా అతడిని సాయిసేవా సమితి వారు సాయిబాబ శేష వస్త్రంతో సన్మానించారు.

మామిడి చెట్లు దగ్ధం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన పోతుల దామోదర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డికి చెందిన మామిడి తోటకు శుక్రవారం అనుమానస్పదంగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో దాదాపు 18 ఏళ్ల వయస్సు గల 15 మామిడి చెట్లు కాలిపోయాయని బాధిత రైతులు వాపోయారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారు కోరారు.

వేణుగోపాలస్వామి ఊరేగింపు



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో చౌడేశ్వరీదేవి జాతర సందర్భంగా శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చుకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం వేణుగోపాలస్వామి వారి పల్లకీసేవ పుర వీధుల్లో భజనలతో ఊరేగింపు చేశారు.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



ఖిల్లాఘనపురం: మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బెన్నూరు ఆశన్న, అధ్యక్షుడిగా శేఖర్‌నాయీ, ఉపాధ్యక్షులుగా అనిల్, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా విద్యారంగంలో అభివృద్ధి చెందాలని సూచించారు. ఉన్నత చదువులు చదివినప్పుడే అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, సభ్యులను శాలువాలతో సన్మానించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పెబ్బేరు రూరల్: ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య విజ్ఞాన సంస్థ తూడికుర్తి వైద్య బృందం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కళాశాలలో ఉండే దాదాపు 250 మంది విద్యార్థినులకు వైద్యులు రాజు, వెంకటయ్య, శ్రీనివాస్ కంటి పరీక్షలు చేశారు. వీరిలో 35 మందికి కళ్ల అద్దాలను అవసరం సూచించారు. అదే విధంగా 10 మంది విద్యార్థునులకు ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గంధం రంగస్వామి, అధ్యాపకులు కేతావత్ దశరథ్‌నాయక్ పాల్గొన్నారు.



'ప్రజాపాలన' కోసం వివరాల సేకరణ



కేతేపల్లిలో..



వీపనగండ్లలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఆత్మకూర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రూ.500లకే సిలిండర్ పథకానికి అమలు కోసం అర్హుల నుంచి అధికారులు వివరాలు సేకరించారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని వార్డుల్లో కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దరకాస్తుదారుల వివరాలు నమోదు చేశారు. వారం రోజుల్లోగా పట్టణంలోని పది వార్డుల్లో గ్యాస్ సిలిండర్ వినియోగదారుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా అందించే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో విద్యుత్ అధికారులు అవగాహన కల్పించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు భాస్కర్‌రెడ్డి, వెంకటస్వామి మాట్లాడుతూ.. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను అందించి మీటర్ రీడింగ్‌కు వచ్చే విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణు, బీరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ అధికారులు అర్హత ఫారాలను పరిశీలించారు. ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు, రేషన్ కార్డులతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అవసరమైన వారి నుంచి పూర్తి వివరాలు తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు లైన్‌మెన్ భాస్కర్ తెలిపారు.

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో రూ.500 కే గ్యాస్ సిలిండర్‌కు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అంగన్‌వాడీ టీచర్లు యాప్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, భారతి, సంగీత, చెన్నమ్మ పాల్గొన్నారు.

తెలుగు జాతి గర్వించే వ్యక్తి 'పీవీ'

కొత్తకోట: తెలంగాణ ముద్దు బిడ్డ దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డు ప్రకటించడం గర్వించదగ్గ విషయమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడి అనేక సేవలు అందించారని కొనియాడారు.

వ్యక్తి అదృశ్యం

పాన్‌గల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య మద్యానికి బానిసై, నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ఆయన ఇప్పటికి ఇంటికి తిరిగిరాలేదు. చుట్టూ ప్రక్కల గ్రామాల్లో, తెలిసిన వ్యక్తులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. నల్లని చుక్కల అడ్డపంచె, పసుపు రంగు డబ్బాల తువాలు ధరించి ఉన్నాడు. కుడిచేతిపై ఒక పచ్చబొట్టు కలదు. శుక్రవారం వెంకటయ్య భార్య పెంటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతని ఆచూకీ తెలిస్తే పాన్‌గల్ పోలీసులకు, సెల్ నంబర్ 87126 70616 సమాచారం ఇవ్వాలన్నారు.

పకడ్బందీగా ప్రయోగ పరీక్షలు

వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని డీఐఈఓ మద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం వేళల్లో జరిగిన పరీక్షలకు 846 మంది విద్యార్థులకుగాను 820 మంది హాజరుకాగా.. 26 మంది గైర్హాజరైనట్లు వివరించారు. పెబ్బేరు, శ్రీరంగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

బుద్ధారం గండి ఆలయంలో ప్రత్యేక పూజలు



బుద్ధారం గండి ఆలయం లో పూజలు చేస్తున్న భక్తులు



ఖిల్లాఘనపురం వీరభద్ర స్వామి ఆలయం వద్ద..

గోపాల్‌పేట: మండలంలోని బుద్ధారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భజనలు, పల్లకీసేవ, అన్నదానం చేశారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ రామేశ్వరశర్మ, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య రోజున ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటుగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

ఇఫ్టూలో చేరికలు

ఆత్మకూర్: సీఐటీయూలో కొనసాగుతున్న మున్సిపాలిటీ కార్మికులు శుక్రవారం ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘంలో చేరారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు హన్మంతు, జిల్లా కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ముందుంటుందని అన్నారు. అలాగే ఈనెల16న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె, బంద్‌లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామీణబంద్‌ను జయప్రదం చేద్దాం



కొత్తకోటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అమరచింత: దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న నిర్వహించే గ్రామీణ బంద్ కార్యక్రమం జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ కోరారు. మండలంలోని చంద్రనాయక్‌తండాలో శుక్రవారం గ్రామీణ బంద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను రైతులు, కార్మికులకు అందిస్తూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తక్కువ కేటాయింపులు చేసి రైతుల నడ్డి విరిచేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో మన్యం, శివ, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

ఐకేపీ, వీఓఏ సమ్మె నోటీస్

పెండింగ్‌లోఉన్న వేతనాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా వెంటనే గుర్తించాలంటూ ఐకేపీ, వీఓఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీఎం శ్రీనివాసులుకు సమ్మె నోటీస్ అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐకేపీ, వీఓఏల బకాయి వేతనాలతో పాటు సమ్మె కాలం నాటి వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వీఓఏల వేతనాలు వ్యక్తిగత ఖాతాలోకి జమ చేయాలన్నారు. కార్యక్రమంలో రంగన్న, చంద్రకళ, మాధవి, వరలక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన చేపట్టే గ్రామీణ బందును జయప్రదం చేయాలని కోరుతూ గోవర్ధనగిరిలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బందులో పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు ఖాజా ఉస్సేన్ విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయడంతో పాటు పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని, ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బడ్జెట్ పెంచాలని కోరుతూ 16న జరిగే బందులో పాల్గొంటున్నట్లు తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

కొత్తకోట రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు కొత్తకోటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిక్సన్ మాట్లాడుతూ 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1996, ఇతర నిర్మాణ కార్మికుల సమగ్ర కేంద్ర చట్టాలను రక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈనెల 16న చేపట్టే కార్మికుల సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుప్పటి శ్రీను, జనార్దన్, అస్కని శ్రీనివాసులు, వెంకటయ్య, చిన్న రాములు, ఆంజనేయులు, కె.వెంకటయ్య, రవి, నర్సింహ్మ, గొల్లరాములు, వెంకటన్న, కుర్మన్న, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..



చంద్రనాయక్‌తండాలో..



గోవర్ధనగిరిలో..

యువత స్వచ్ఛందంగా ముందుకురావాలి



రక్తదానం చేస్తున్న యువకులు

వనపర్తి టౌన్: రక్తదానం చేసే ప్రతి మనిషి దైవ సమానం అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాం పాషా అన్నారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో కొంతమంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ మేరకు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ప్రభాకర్, కలాం పాషా, సభ్యుడు గోనూరు యాదగిరి, జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్‌కుమార్ రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా కలాం పాషా మాట్లాడుతూ... రక్త నిధి కేంద్రంలో రక్త నిల్వలు ఆశాజనంగా లేని కారణంగా రక్త హీనతతో బాధపడుతున్న బాధితులను అత్యంత దయనీయ పరిస్థితి ఉందని, 18ఏళ్లు దాటిన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రక్త నిధి సిబ్బంది లక్ష్మీపతి, రమేష్, తిరుపతయ్య, కార్తీక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన మోడీతోనే సాధ్యం



ఖిల్లాఘనపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు



సూగూరులో..

ఖిల్లాఘనపురం: దేశంలో అవినీతి రహిత పాలన ప్రధానమంత్రి నరేంద్రమోడీతోనే సాధ్యమని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు విక్రం, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, కొరిగల గోపి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దళితవాడ, కురువగేరి, ముదిరాజ్ కాలనీల్లో 'పల్లెకు పోదాం, ఇంటికి పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల బీజేపీ నాయకులు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని కాలనీల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి గావ్ చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్మూకశ్మీర్ ప్రజలకు శాంతి, ప్రగతిని అందించిన ఘనత బీజేపీకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, పురుషోత్తం, బండారి రాజు, బెస్త శివ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో దేశంలో అభివృద్ధి వేగంగా కొనసాగుతుందని మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్ అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సూగూరులో ఇంటింటికీ తిరుగుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన మహిళలకు ఉచితంగా ఉజ్వల సిలిండర్లు, ఆయుష్మాన్‌భారత్, ఆవాస్‌యోజన, పీఎం విశ్వకర్మ పథకాలను ప్రవేశపెట్టారు. దేశంలో అభివృద్ధి కొనసాగాలంటే మోడీ మూడోసారి ప్రధానిగా గెలిపించాలని కోరారు. పీఎం కిసాన్ కింద రైతులకు రూ.6 వేలు చొప్పున అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన నరేంద్రమోడీని ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నా. కార్యక్రమంలో దేవేందర్‌నాయుడు, జగదీష్, కరుణాకర్, యశ్వంత్, నరేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశాల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

వనపర్తి: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా చేపట్టారు. ఆశావర్కర్ల ధర్నాకు మద్దతు ప్రకటించిన సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, పుట్ట ఆంజనేయులు ధర్నానుద్దేశించి మాట్లాడారు. ఆశా వర్కర్లకు రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వేతనాలు వెంటనే చెల్లించాలని, ఆశాలతో అదనపు పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. అక్టోబర్ 9న అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని ఆశాలకు రూ. 18 వేల పారితోషికం ఇవ్వాలని, 2021 జులై నుంచి డిసెంబర్‌కు ఆరు నెలల పీఆర్సీ, ఏరియల్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన అలవెన్సులు నెలకు రూ. వెయ్యి చొప్పున 16 నెలల బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, రాము, నందిమల్ల రాములు, భాగ్య, ఇందిరా, శ్యామల, జ్యోతి. లక్ష్మీదేవి సుజాత , లావణ్య, రేణుక, అనసూయ పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత



కొత్తపేటలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న తహసీల్దార్ అశోక్‌నాయుడు



ఖిల్లాఘనపురంలో..



మూలమళ్లలో..

ఆత్మకూర్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా డ్రెయినేజీల్లో పూడిక తీశారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, కంపచెట్ల తొలిగింపు, రోడ్లు శుభ్రపర్చడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం లాంటి పనులు చేపట్టారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ రాజు, తహసీల్దార్ పాండు నాయక్, ఏఈలు కబీర్‌దాసు, వెంకటేశ్వర్లు, ఏఓ మల్లయ్య తదితర ప్రత్యేక అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు..

పాన్‌గల్: గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఇన్‌చార్జ్ తహసీల్దార్, జీపీ ప్రత్యేకాధికారి అశోక్‌నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట గ్రామాన్ని సందర్శించి మురుగు కాల్వల శుభ్రత, నర్సరీలో మొక్కలు, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ, అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం, చిన్నారుల భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.